
# పాపం!... రామనాథం!

'కవిప్రసాద్'



"గోపాలరావు గారున్నారా?" వణుకుతున్న కంఠం నిరాశను నిస్పృహను మోసుకొచ్చింది లోపల్నుంచి ప్రతిధ్వని తప్ప సమాధానం లేక పోవటంతో మరలా ఒకసారి నిశ్శబ్దాన్ని భంగపరిచిందా కంఠం.

"ఎస్ కమిన్" వ్రాసుకుంటున్న గోపాలరావు ఆహ్వానించాడు.

రామనాథం లోపలికి ప్రవేశించాడు. ఒకచేతిలో దీర్ఘ స్తంభములాగు కర్రతో నెమ్మదిగా

"నమస్కారం బాబూ" అన్నాడు

"కూర్చోండి" రామనాథం కూర్చున్నాడు. ఒక్క క్షణం గదిని పరికాయించి చూశాడు రామనాథం చేస్తున్న పనిని ఆపి రామనాథం వైపు ఏమిటన్నటు చూశాడు గోపాలరావు

'మీతో కొద్దిగా పనిఉండి చిన్నగా అన్నాడు రామనాథం.

చెప్పండి" కొద్ది విసుగ్గా అన్నాడు గోపాలరావు

"నా పేరు రామనాథం మాది ఏలూరు మా అబ్బాయి శ్రీధర్ బి ఎ ఫైనల్ పరీక్షలు వ్రాశాడు" క్షణం ఆగాడు రామనాథం.

'నేను టీచర్‌గా రిటైర్ అయ్యాను నా పెద్ద కొడుకు శ్రీధర్ ఇప్పటికి రెండు సార్లు పరీక్ష పోయింది. మూడవసారి పరీక్ష వ్రాశాడు. అన్నీ బాగానే వ్రాశాడు. ఇంగ్లీషు లోనే డల్‌గా ఉన్నాడు. అందుకని మీ వద్దకు వచ్చాను" గోపాలరావు వైపు చూశాడు రామనాథం

"ఇంతకీ నన్నేం చేయమంటారు!" తెలియనట్లు అడిగాడు గోపాలరావు.

"వాడు పైకొస్తే! వాడిమీద ఆశపెట్టుకొని మేమంతా బ్రతుకుతున్నాము ఆ ఇంగ్లీషు పేపర్లు మీరు దిద్దుతున్నట్లు తెలిసింది దయయుంచి కాస్త మా శ్రీధర్‌ను మీరు కనిపెట్టాలని ఆశతోవచ్చాను' ఆశాపూరిత కంఠంతో అన్నాడు రామనాథం.

"సారీ మిష్టర్ రామనాథం గారు! ఐ కాంట్" రామనాథంగారు మాట్లాడలేదు. గోపాలరావు ముఖంవంక సూటిగా తీక్షణంగా చూస్తున్నాడు

'రామనాథం గారూ! డ్యూటీ ఈజ్ మై డ్యూటీ మీరుగూడా టీచర్‌గా పని చేసినవారు కాబట్టి నన్నర్థం చేసుకోండి"

రామనాథం గోపాలరావు మాటలను వింటున్నా ఆయన మనస్సు ఎక్కడో ఆలోచిస్తోంది.

'అవును! అవును!' సంభ్రమంగా తనలో తాను గొణుక్కున్నాడు రామనాథం,

"విధి ఎంత విచిత్రమైనది. ఆనాటి గోపాలరావు వద్దకు ఈనాడు తనను లాక్కొచ్చింది" స్వగతంగానే అనుకున్నాడు రామనాథం. ఆయన మనస్సు గతంలోకి జారింది.

ఆ నాడు —

ఆకాశంఅంతా మేఘావృతమై యుంది. సన్నగా తుంపరలు రాలుతున్నాయి. టైము మూడు గంటలయింది. రామనాథం ఎస్. ఎస్. ఎల్. సి పేపర్లు దిద్దుతున్నాడు ముఖానపట్టిన చిరుచెమటను తుడుచుకొని దిద్దినపేపరు నవతలపడేసి రోడ్డుమీదకు దృష్టి సారించాడు. ఎదురుగ్గా అతను! రామనాథానికి ఆశ్చర్యమేసింది. రోజూ తను పేపర్లుదిద్దటం ప్రారంభించగానే అక్కడ ప్రత్యక్షమవుతాడు, దిద్దటం ముగించగానే వెళ్ళిపోతాడు. ప్రతిరోజూ అతని దినచర్య యిదే. ఎదురుగావున్న శిధిలమైన ఇంటి అరుగుమీద కూర్చుంటాడు. రామనాథం ఒక్కసారి అతనికేసి మరలా చూశాడు. అతని చూపులు తనపైనే కేంద్రీకరించబడ్డాయి. అతని చూపులు నిరాశనిస్పృహలను వెళ్ళగక్కుతున్నాయి. రామనాథం తలకాయవంచి ఇంకొకపేపరు తీసి దిద్దాడు. మళ్ళీ తలఎత్తి చూశాడు. ఆ అతను ఇంకా అక్కడే ఉన్నాడు. రామనాథానికి అతని చరిత్ర తెలుసుకోవాలనిపించింది పైగా అతను వానలో తడుస్తున్నాడు. చలికి వణుకుతున్నాడు. రామనాథానికి జాలివేసింది. రమ్మని పిలిచాడు.

ఆ అబ్బాయి మొదట సందేహించాడు. విన్నె అన్నట్లు చూశాడు రామనాథం. నెమ్మదిగా లోపలికి ప్రవేశించాడు. తలతుడుచుకోవడానికి తుండిచ్చి

"ఎవరబ్బాయివి? నీ పేరేమిటి" అడిగాడు రామనాథం.

"నా పేరు గోపాలరావండి" అన్నాడు ఆ అబ్బాయి "అలాగా బాబూ! రోజూ యిటే చూస్తుంటావు?"

"మాది గుడివాడ మాష్టారూ! మా నాన్న రైల్వే పోర్టరుగా పనిచేసే వాడు మా నాన్న చనిపోయి నాలుగేళ్ళయింది" అతని కంఠం గద్గదికమయింది క్షణం ఆగి మళ్ళా చెప్పాడు.

"మా అన్నయ్య గూడా రైల్వే పోర్టరుగా విజయవాడలో పనిచేస్తూ హార్టుకంప్లయింట్ వలన చనిపోయాడు. సంవత్సరమయింది. నాకు ఇద్దరు తమ్ముళ్ళు ముగ్గురు చెల్లెళ్ళున్నారు. ఇప్పుడున్న వాళ్ళలో నేనే పెద్దవాణ్ణి. మొదటిసారి పరీక్షకు వెళ్ళినపుడు తప్పాను. రెండోసారి వెళ్ళటానికి డబ్బు లేక నేనుగూడా రైల్వే పోర్టరుగా చేరి పరీక్ష ఫీజు కట్టాను. మా అమ్మ కూలిపని చేసి మమ్మల్ని పోషిస్తోంది తినీ తినకా గుట్టుగా బ్రతుకుతున్నాము.

ఈ ఎస్. ఎస్. ఎల్. సి. పరీక్షలో అన్నీ బాగా నే వ్రాశాను. ఇంగ్లీషులోనే నేను చదివిన ప్రశ్నలు రాలేదు. అందుచేత మీ వద్దకు వచ్చాను" అతనికి అభిమానం అడ్డువచ్చి మరి మాటలాడ లేక పోయాడు.

రామనాథానికి అతనిపై విపరీతమైన అభిమానం జాలికల్గినాయి. కాని వాటిని బయటకు కనపడ నీయలేదు.

"ఇంతకే నష్టం చేయమంటావు?"

"సార్! మీరు నన్ను పాసుచేస్తారనివచ్చాను"

"చూడబ్బాయ్! నా సర్వీసెంతో తెలుసా! ముప్పై అయిదేళ్ళు. ఇన్నేళ్ళ సర్వీసులోనూ నేను నా విధిని సక్రమంగా నిర్వహిస్తూ వచ్చాను. ఈ నాడు నీకోసమని తప్పటడుగు వేయమంటావా? చూడబ్బాయ్! నన్నర్థంచేసుకో. ఇంకా నాలుగైదు సంవత్సరాల్లో రిటైర్ కాబోతున్నాను. నీ కోసమని నేను ఈ పనిచేసి నా ఆత్మను వంచించుకోలేను. ఒకసారి పోయినంతనే దిగులుపడే ఎలా? ట్రై అండ్ ట్రై ఎగైన్, యూ విల్ సక్సీడ్, ఇలా పరీక్షపోయేది నీ కొక్కడికేనా? దిగులుపడి మోక, బాధపడినవాడెవడూ బాగుపడబోడు. ఇంత చిన్న విషయానికి ఇలా ఎంతకాలం బాధపడతావు. ధైర్యంతో మరిలా కట్టు. ఈ మాటు తప్పకుండా పాసు అవుతావు." గుక్కతిప్పుకోకుండా అన్నాడు రామనాథం.

"సార్! ఎంతో ఆశతో వచ్చాను. నేను, నా ముగ్గురు చెల్లెళ్ళు, ఇద్దరు తమ్ముళ్ళు మా అమ్మ యింతమందిమి మిమీద ఆధారపడి ఉన్నాము"

"నేను చెప్పదల్చుకున్నది చెప్పాను. ఇంక నేనేం చెయ్యను."

"మాష్టారూ! అట్లా అనకండి మాష్టారూ! నాకీ సహాయంచేస్తే జన్మజన్మలకీ మరిచిపోను. కనీసం నాలుగు ట్యూషను చెప్పుకొని బ్రతుకుతాను. సార్! కాదనకండి" నిజంగానే ఏడ్చాడు గోపాలరావు

"దయార్ద్ర హృదయుడైన రామనాథం మనస్సు ఆగలేక పోయింది. కాని కల్దొక్కుకున్నాడు

"ఇదిగో! అబ్బాయ్! చెప్తుంటే నీక్కాదూ! ఇక లాభంలేదు, ఇకనీ వెళ్ళవచ్చు" కర్కశంగా పలికాడు రామనాథం.

అభిమానం వెల్లువికి వస్తుండగా గోపాలరావు మెల్లిగా బయటికి నడిచాడు.

"ఇదిగో! గోపాల్రావు! నీ నంబరిచ్చి వెళ్ళు." ఆదేశించాడు రామనాథం.

గోపాల్రావు వణికి పోయాడు, దుఃఖం ముంచుకు వస్తుంటే.

"సార్! అపని చెయ్యకండి సార్. ఇంకెప్పుడు చెయ్యను సార్. నన్ను డిబార్ చేయకండిసార్." గోపాల్రావు ప్రాధేయపడ్డాడు.

రామనాథం నిశ్చేష్టుడై పోయాడు. తెప్పరిల్లి "కాదు! బాబూ, నిన్ను తప్పకుండా పాసుచేస్తున్నాను. అందుకే నంబరు అడిగాను."

"నిజంగానా సార్!" నమ్మలేనట్లు అడిగాడు.

"నన్ను నమ్ము బాబూ! నిజంగా బాబూ!

"గోపాల్రావు నంబరు చెప్పాడు.

"మీ మేలు జన్మలో మరువ లేను మాష్టారూ! మీ మేలు జన్మలో మరువలేను."

దొస్తువర్రి! ఈ విషయం ఎవ్వరితోనూ చెప్పకు వెళ్ళిరా అన్నాడు రామనాథం కృతజ్ఞత ఒలికించుకుంటూ వెళ్ళాడు గోపాల్రావు. వెంటనే గోపాల్రావును సెకండు క్లాసులో పాసు చేశాడు రామనాథం.

* * *

గతంనుంచి వర్తమానంలోకి మేలుకున్నాడు రామనాథం

"రామనాథంగారూ! యిదివరకేచెప్పాను గదండీ లాభంలేదు. నేనటువంటి పనిచెయ్యను. ఇక మీరు వెళ్ళవచ్చు" అన్నాడు గోపాల్రావు రామనాథాన్ని గుర్తించకుండా.

గోపాల్రావుగారూ! కాస్త నామాట వినండి. మీమేలు జన్మలో మరువలేను, గోపాల్రావును ప్రాధేయపడ్డాడు రామనాథం.

"లాభంలేదు మాష్టారూ! మీరే ఆలోచించండి న్యాయదృష్టి లేని మీ కుర్రాణ్ణి పాసుచేస్తానను కోండి రేపు మీ అబ్బాయి ఇలాగా టీచర్ అయితే మళ్ళీ స్టాండర్డులేనితనలాంటి స్టాండర్డులేని విద్యార్థుల్ని తయారుచేస్తాడు. ఇంతమంది విద్యార్థుల వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మాట్లాడండి మాష్టారూ "

రామనాథానికి ఆవేశం ముంచుకొచ్చింది, ఆగ్రహం పట్టలేకపోయాడు.

గోపాల్రావ్! నాకు బాగా బుద్ధిచెప్పావు. నా డ్యూటీని సరిగా నిర్వహించనందుకు సరైన గుణపాఠం నేర్పావు. మానవత్వం, కృతజ్ఞత నీలో ఏకోశాన లేవు ఏరుదాటిన తర్వాత తెప్పను తగలబెట్టేరకం మీరంతా! ఆనాడు నీ ఎస్. ఎస్. ఎల్. సి పరీక్షపేపర్లు దిద్దేటప్పుడు జ్ఞాపకం తెచ్చుకో. ఈ చేతులతో నిన్ను ప్యాసుచేశాను. ఆనాడు "మీమేలు మరువలేను" అని అన్నావే! కృతఘ్నుడా! నాది తప్పు. ఈనాడు, నా దయవలన యింతవాడవైన నీవు నాకు, ఏభై అయిదేళ్ళ ప్రపంచాన్ని పరికించిన నాకు నీతులు నేర్పుతున్నావు. హా! గోపాల్రావ్ నువ్వు చాలా గొప్పవాడివై పోయావు. గురువుని మించిన శిష్యుడవయ్యావ్. నీవుచేసిన పరాభవం జన్మజన్మలకీ మరిచిపోలేను. అనుభవిస్తావు గోపాల్రావు. అనుభవిస్తావు"

నిశ్చేష్టుడై, నిరుత్తరుడై వెర్రిగాచూస్తున్న గోపాల్రావుని సంభ్రమంలో ముంచి ఆవేశంతో కర్రపట్టుకుని రోడ్డుపట్టాడు రామనాథం.

ఆలోచననుంచి తేరుకున్న గోపాల్రావుకు లారీ క్రిందపడి రామనాథం కళేబరం శపిస్తూ కనబడింది.

పాపం! రామనాథం!

## నీవూ - నీచుట్టూ ప్రపంచం

[16 వ పేజీ తరువాయి]

నిరాధారమైన పాతపాటనే పాడుతున్నాడు.

తన విధానానికి, సైనిక దాడులను ఉధృతం చేయడమే సమాధానమైతే దక్షిణ వియత్నాంలో మిగిలి ఉన్న సైనికుల సర్వసైన్యాధ్యక్షుడుగా తను పూర్తిబాధ్యతతో వ్యవహరించవలసి వస్తుందని నిక్సన్ ఉత్తరవియత్నాంను హెచ్చరించాడు.

అమెరికా సైన్యాల ఉపసంహరణ అమెరికన్ యుద్ధఖైదీల విడుదల ప్రతిపాదన నిక్సన్ పథకంలో ఉన్నప్పటికి, థాయిలాండ్‌లో తిష్టవేసిన అమెరికా వైమానిక దళాలూ, సప్తమ నౌకాదళం ఉపసంహరణ ప్రసక్తే లేదు. ఇవి ఆ ప్రాంతంలో ఉండడం, ఉత్తర వియత్నాందేశ భద్రతకేముప్పు.

తమతో నిమిత్తం లేకుండా, ఎవరైనా వియత్నాం సమస్యపై రాజీ పడితే తమకేమి సంబంధం లేదని ఉత్తర వియత్నాం దక్షిణ వియత్నాం జాతీయ విముక్తి సంఘటన ప్రకటించాయి నిక్సన్ చైనా పర్యటన దృష్ట్యా ఈ ప్రకటన వెలువడింది.

చైనా, కాస్త ఆలస్యంగానైనా ఉత్తర వియత్నాం ప్రతిపాదనలను బలపరుస్తూ ప్రకటన చేసింది.

ఈ వాతావరణం కనిపెట్టి, నిక్సన్ కాస్త వెనకడుగు వేశాడు బింకం కాస్త తగ్గింది. వియత్నాంపై సాగే సంప్రదింపుల్లో అమెరికా కాస్త పట్టువిడుపు ధోరణిని ప్రదర్శిస్తుందన్నాడు.

నిక్సన్ రహస్య సంప్రదింపుల విషయాన్ని వెల్లడించడం శాంతియుత పరిష్కారానికి తీవ్రమైన ఆటంకమని, ఉత్తర వియత్నాం ప్రతినిధి వర్గనాయకుడు క్సువాన్‌థీ విమర్శించారు.

అమెరికా అధ్యక్ష ఎన్నికలకుముందు వియత్నాం సమస్యపై అంగీకారం కుదిరే అవకాశం వుందని అసలు రహస్యాన్ని రోజర్స్ బైటపెట్టాడు.

### థియూ ఆక్రోశం

రోజర్స్ ప్రకటనపై థియూ మండిపడాడు. అమెరికా దక్షిణ వియత్నాంను ద్రోహం చేయడానికి, అంతరంగిక వ్యవహారాలలో జోక్యం చేయ ప్రయత్నిస్తున్నాడని థియూ తీవ్రంగా విమర్శించాడు. తానధికారంలోనున్నది అమెరికా దయాదాక్షిణ్యాల వలనన్న సంగతి మరిచాడు శాంతికోసం దక్షిణ వియత్నాంను అమెరికా బలిపెట్టబోతోందని ప్రభుత్వం అనుమానించవలసి వస్తున్నదని ప్రకటించింది

థియూ ఎంత మొత్తుకున్నా, నిక్సన్ తన అధికారాన్ని సంరక్షించుకోవడానికైనా, వియత్నాం సమస్యపై రాజీపడి తీరాలి

ఈ నిక్సన్ ఎత్తుగడలను అమెరికాలో యితర రాజకీయవేత్తలు క్షుణ్ణంగా అర్థంచేసుకున్నారు.

ఈ రహస్య సంప్రతింపులను రాజకీయ ప్రయోజనంకోసం నిక్సన్ వెల్లడిచేశాడని అమెరికాలో విమర్శిస్తున్నారు.

★